

# పని+మనీ+షి

—గుండు అన్నపూర్ణ


'అబ్బ—ఎంత చవక!' అను రూపాయల జీతం చాలనగానే.

కున్నాను, పనిమనిషి పన్నెండు

* * *

చింతలపూడిలో కూడా, అన్ని ఊళ్ళల్లోలాగానే పని మనిషి దొరకటం కష్టం. మేము వచ్చిన కొత్తలో నానా ఇబ్బందీ పడ్డాం. ఆటు తర్వాత వెతగ్గా వెతగ్గా ఇద్దరు పనివాళ్ళు కనిపించారు. వాళ్ళ రేట్లు వినేసరికి నా గుండె ఆగిపోయింది. ఒక తెకు పాతిక ఇచ్చి, రోజూ అన్నంపెట్టి కాఫీ ఇవ్వాల్ట! ఇంకొక తెకు ఇరవై ఇచ్చి, దాని పన్నెండేళ్ళ పిల్లలకు అడిగినప్పుడల్లా సినిమా డబ్బు ఇవ్వాల్ట! ఎంత బాధ అనిపించిందంటే, గవర్నమెంటు ఉద్యోగస్థులకు చవకలో ఇళ్ళనూ, వాటితో బాటు పని మనుషుల్నా చూపించే పార్టీయే ప్రభుత్వం నడపటానికి తగుననీ, దానికే ఓటు వెయ్యాలనీ ప్రచారానికి బయల్దేరదామా అన్నంత! ఎంతయినా ఆడదాన్ని గాబట్టి నా క్షోభ నాలోనే ఉండిపోయింది.

సరే, ఇంకా నాలుగైదు రోజులు నా తిప్పలు నేను పడ్డాక ఇంటావిడ నా బాధ చూడలేక నా రక్షణకొచ్చింది. ఎవత్తెనో వయస్సులో వున్న ఒకదాన్ని తీసుకొచ్చి నా కప్పగించింది. "అబద్ధమాడదనీ, దొంగతనం చెయ్యదనీ, ఒళ్ళు దాచుకోదనీ దీనికి పేరుందండీ! జీతం కూడా ఎక్కువడగదను



కుంటాను.మాట్లాడుకోండి" అంది.

నేను దానివంక చూసాను. దానికి ఇరవై ఏళ్ళుండొచ్చు. పిట పిటలాడుతోంది. పెద్దగా రంగు లేదు కాని, మొహం మాత్రం ఆకర్షణీయంగా వుంది. ఏ బ్యూటీ కంటెస్ట్‌లోనయినా తేలిగ్గా ప్రైజు కొట్టేసేటంత నీట్‌గా సింగా రించుకునుంది.

"నీ పేరేమిటి?" నే నడిగాను.

"వోనిస్రీ అండి" అంది, సిగ్గు అభినయిస్తూ.

'దీని సిగ్గు బుగ్గయిపోనూ' అనుకున్నాను.

"ముగ్గెయ్యటం, అంట్లు తోమ టం, నీళ్ళు తోడటం, బట్టలుతక టం చెయ్యాలి. ఎంతిమ్మంటావు? ఒకే మాట చెప్పేయ్!" అన్నాను.

"అబ్బే, ఎంతిత్తారండీ? మీరు మా తరం అబ్బాదికార్లా యేంటి? ఏదో ఉద్యోగపోళ్లే గదా! పన్నెండు రూపాయ లివ్వియ్యండి సామీ!"

అంత తక్కువ రేటుకు ఆశ్చర్య పోయాను.

'అబ్బ—ఎంత చవక!' అను కున్నాను. అన్నాను-"ఇంకా...?"

"ఇంకా యాంటండీ? యింకా లేదండీ. పన్నెండుకు తగ్గేది లేదండీ!"

"కాఫీలు, అన్నాలు అడుగు తావా?" అని అడిగాను.

"యింకేం లేదని నేనే సెప్పాను గాదండీ!"

"నెల మధ్యలో అడిగితే అప్పటికొచ్చే జీతం మాత్రం ఇస్తాను. అడ్వాన్సు ఇవ్వను."

"అబ్బే! అట్టాంటి దాన్ని గాదండీ!"

"అప్పుడప్పుడు అట్లా సెంటరు కెళ్ళి కూరలు తెచ్చి పెట్టాలి."

"మరే- నాకు తెలేదేటండీ! కూరలు నే తేనాకపోతే మీకెవరు తెచ్చి పెడతారండీ!"

"అంట్లు శుభ్రంగా తోమాలి. బట్టలు ముఖ్యంగా పిల్లలివీ, అయ్యగారివీ శుభ్రంగా ఉతకాల."

"మీరే సూత్తారుగా!"

'ఇది ఎగ్రిమెంటు సమయం కనక అన్ని కండిషన్లూ ముందరే మాట్లాడుకోవటం అవసరం. లేక పోతే తర్వాత తర్వాత నెత్తికెక్కి కూర్చుంటారు' అన్న భావంతో నేను, అప్పటికి జ్ఞాపకానికొచ్చిన వన్నీ అడిగేసాను. ఇంకేం అడ గాలో ఎంతాలోచించినా స్ఫురించ లేదు.

ఏమయినా ఉంటే అదే బయట పెడుతుందని- "నువ్వే మడుగు తావో ఇప్పుడే అడిగేయ్!" అన్నాను.

"మీ ఇంట్లో ఎంతమందండీ?"

"మేం మిద్దరం, ముగ్గురు పిల్లలు."

"గాస్, కుంపటాండీ?"

"గాసే."

"అయితే పన్నెండు సాల్లెండి. మరయితే ఎప్పట్నుంచి రమ్మంటారండీ?"

"రేపట్నుంచే."

'వోవిస్రీ' వెళ్ళిపోయింది.

ఈ సారి నాకు మతేపోయింది. 'అన్నాలూ, కాఫీలూ లేకుండా పన్నెండు రూపాయలకు ఆంధ్ర దేశంలో కాదు- భారత దేశంలో ఎక్కడయినా ఇంత చవకగా పని మనిషి పనిచేస్తుందా ఈ రోజుల్లో?' అనిపించింది నాకు.

* * *

'వోవిస్రీ' మర్నాడుదయం ఆయిదుగంటలకే వచ్చేసి పాచి పని చేసేసి, నేను బయట పడే సుంచిన బకెట్లలోకి నీళ్ళు తోడి వెళ్ళిపోయింది. మళ్ళీ టంచనుగా ఏడుకొచ్చేసి కాఫీ గిన్నెలూ అంట్లూ తోమేసి అప్పజెప్పేసి వెళ్ళిపోయింది. మళ్ళీ మధ్యాహ్నం మూడు కొచ్చింది. అంట్లు తోమే సింది.

ఓ వారం గడిచింది.

ఊళ్ళోకి 'స్వామి అయ్యప్ప' సినిమా వచ్చింది. మర్నాడే అది వారం కూడా వచ్చేసింది. పిల్లల గోల ఎక్కువవటంతో మేము ఫస్టుషోకి వెళ్ళాలనుకున్నాం. ఎట్లాగో 'వోవిస్రీ' ఈ విషయం పసిగట్టేసింది.

"అడ్వాన్సు బుక్కింగులో కొనుక్కోపోతే మీకు టిక్కెట్లు దొరకవమ్మగారూ! డబ్బులివ్వండి నేను తెచ్చి పెడతా" అంది.

పదిహేను రూపాయ లిచ్చాను. మూడుగంట్లకల్లా టిక్కెట్లతో వచ్చేసింది. "మా పెద్దతోపులాట గుందమ్మగారూ! బ్లాకులో కొనుక్కొచ్చేసాను. డబ్బులు మిగల్లేదు" అంది.

రెండ్రోజుల తర్వాత కూరలూ, పూలూ తెమ్మనమని ఆయిదిచ్చి పంపించాను. 'వోవిస్రీ' తిరిగొచ్చి అర్ధరూపాయి చేతిలో పెట్టింది.

"అదేమిటే?" అన్నాను.

"నేనేం జెయ్యనండీ! కూర్లు యియ్యేల రేట్లు పెరిగాయంట. పూలు అస్సలు ఒక్కసోటే వున్నాయి. పూల్లేకపోతే పర్లేదు గానండి, కూరల్లేకపోతే తిండెట్లా గడుత్తదండి మనకి? అందుకవి తెచ్చేసాను" అంది.

నా లెక్క ప్రకారం నాకు రూపాయిన్నర నష్టం!

* * *

కొందరు పనిమనుషులు మహా ప్రమాదకారులు. ఇంట్లో మనం అనుకున్న మాటలు, పక్కవాళ్ళతో మనం ఆడుకున్న ముచ్చట్లు-శ్రద్ధగా బుర్రలో కెక్కించేసుకుని, మహా జాగ్రత్తగా మనసుంచే గిట్టనివాళ్ళ దగ్గర వదుల్తూంటారు. మనస్సులు కలిసినవాళ్ళ మధ్య కూడా భేదాభిప్రాయాలు సృష్టించేస్తూంటారు.

గతంలో ఒకసారి, మేము కొనుక్కున్న కొత్త మంచాలు చుట్టాని కొచ్చిన ఒకావిడ- "ఆ నాయుడిగారి మంచాల సన్‌గ్లాస్ కన్నా మీ మంచాల సన్‌గ్లాస్ బాగున్నదండీ" అంది. మా పాత పనిమనిషి ఎదట ఆవిడ ఈ మాట అంది. నేనంటే అభిమానంగా ఉండే ఆ నాయుడిగారి భార్య మర్నాడు ఉమ్మడి నుయ్యి దగ్గర ఎవరితోనో మాట్లాడుతూ, "ఎవరి ఉేస్తు కొద్దీ వాళ్ళు కొనుక్కుంటారు. దాన్ని గురించి పనివాళ్ళతో ఆడి పోసుకోవటం ఎంత నీచత్వమండీ! అయినా మావి ఒరిజనల్ సన్‌గ్లాస్ షిట్లు. డూప్లికేట్లు కావు" అని నా వైపు కొరకొరా చూస్తూ వెళ్ళిపోయింది. నేను తెల్లబోయాను! ఇట్లాంటి పాత అనుభవాలు నాకు చాలా ఉన్నాయి.

ఈ 'వోవిస్రీ' కూడా 'మోత'ల విషయంలో మోత కెక్కువ చెయ్యి అనే విషయం తెలియటానికి నాకు ఎక్కువ కాలం పట్టలేదు.

ఏం వ్యత్యాసం చేసిందో కాని, ఓ నాటి ఉదయం నాకు అదే పనిగా తల తిప్పుటగా ఉంది. రెండు మూడు వాంతులు వెళ్ళాయి. సాయంకాలానికల్లా గంట కొకళ్ళు చొప్పున నలుగురు ఆడపడుచులు మా ఇంటి కొచ్చారు.

"నాలుగో గర్భమటగా! ఇంకా పెయ్యిండమ్మా!"

"ఈ వీధి నీళ్ళల్లో సుద్ద ఉందండి. మా వీధి కొచ్చెయ్యకూడదూ?"

"ఈ ఇంట్లో ఏదో గాలిఉందని అనుకుంటూంటారు. మీకు తెలీదా?"

ఇట్లాంటి ఊరడింపు వాక్యాల్తో నాకు పిచ్చెత్తించేసారు. అయిదు రూపాయల నోటుతో మందుకోసం బజారుకెళ్ళిన 'వోవిస్రీ' సరిగ్గా ఆదే సమయంలో వచ్చి, రూపాయి కాయితం, రెండు క్యాప్సూల్సు నా కందించింది. అంటే, ఆటొచ్చి ఇటుపోయే పైత్యానికి అది నా చేత ఖర్చు చేయించింది నాలుగు రూపాయలన్న మాట. ఈ ఖర్చులో నిజమెంతో- అబద్ధమెంతో! వాళ్ళ

ముందర దాన్నేమని అడగను?

నా ఇబ్బంది రోజుల్లో మా శ్రీవారే వంట చేస్తారు. ఇంకేం? దానదృష్టం పండింది. హోటల్నుంచి తెప్పించిన టిఫినులో సగం, గదులు ఊడ్చిన తర్వాత కాఫీలు-శ్రీవారి నుంచి దానికి ఉచితంగా సరఫరా అయ్యాయి.

* * *

ఇంకో నాలుగు రోజులు గడిచాయి. గతరాత్రి రెండో ఆట సినిమా కెళ్ళొచ్చిన మహోత్సవంలో ఆ ఉదయం ఆలస్యంగా నిద్రలేచాను. చూద్దును గదా, బాత్రూంలో దృశ్యం ఇది-శ్రీవారు స్నానం చేస్తున్నారు 'ఇంత అందం ఏం సేనుకుంటానురా' అంటూ సన్నగా కూని రాగం తీస్తూ. 'వోవిస్రీ' నీళ్ళు తోడుతోంది. వంటికి చిరుగుల జాకెట్టూ చిరుగుల చీరా అదీనూ? ఆయన దానివైపే తీక్షణంగా చూస్తున్నారు —చికాగ్గానే అనుకుందాం.

నాకు మాత్రం కోపమూ వచ్చింది, కంగారూపుట్టింది. (నాది కూడా ఎంతయినా ఆడబుద్ధేకదా!)

వెంటనే దాన్ని, "నువ్వు తోడక్కర్లేదు. వెళ్ళి అంట్లు చూడు" అంటూ, "నీకా చిరుగుల గుడ్డలు తప్ప వేరే ఏవీ లేవా?" అన్నాను. గోడక్కొట్టిన బంతిలాగా అది సమాధానం ఇచ్చింది- "లేవమ్మ గోరూ! నెలాకర్తాక ఇయ్యే యేసుకు రావాలి" అంది.

నాకు కంగారు రెట్టింపయింది. గబగబా లోపలికెళ్ళి నా తాలూకు నడిపాత వాయిలు చీరా, జాకెట్టూ తెచ్చి దాని మొహాన పడేసాను. "ఇంకెప్పుడయినా చిరుగుల బట్టల్తో పన్లోకొచ్చావో ఊరుకోనేది లేదు" అన్నాను.

"ఎందుకొత్తానందమ్మా!" అంటూ వాటిని తీసుకొంది 'వోవిస్రీ.'

ఎంత హీనంగా చూసినా వాటి ఖరీదు ముప్పైకి తక్కువుండదు!

ఇంకో రెండు రోజులు గడిచాయి. మా ఇంటికి చుట్టాలొస్తున్నారనీ, పొద్దున్నే పెందలాడే రమ్మనమనీ చెప్పాను 'వోవిస్రీ'తో. తెల్లారగానే వాళ్ళు వచ్చారు. నేను కాఫీ వగైరాల్తో అతలాకుతలం అయిపోతున్నాను. 'వోవిస్రీ' ఎంతకీ రాలేదు. బారెడు పొద్దెక్కాక పక్కింటి రావుగారి పనిమనిషొచ్చి, "అమ్మా! అయ్యగార్నోపాలి పోలీసుటేసనుకాడికి రమ్మనమని సెప్పమందండి వోవిస్రీ" అంది.

"ఎందుకే?" అన్నాను.

"రేత్తిరి రత్నా టాకీసుకాడ రౌడీ యెదవలు అల్లరి చేసేరంట. పోలీసోల్లు దాన్నట్టుగెల్లి టేషన్లో యెట్టారు. అయ్యగారొచ్చి సెపితే యిడిసి పెడతారట."

"రౌడీలు అల్లరిపెడితే దాన్ని తీసికెళ్ళటం యేంటీ?"

"అవ్వన్నీ నాకు తెలవ్వండి. అయ్యగార్ని పంపిచ్చినా సరే, లేక పోతే...."

"లేకపోతే?"

"అయిదు రూపాయలిచ్చినా సరే. పోలీసోళ్ళకియ్యాలట."

ఒక్క క్షణం ఆలోచించాను. నా కొళ్ళు మండిపోయింది. అది ప్పుడు పనిలోకి రావటం నా అవ సరం కనుక, కోపం దిగమింగు కుని, అయిదు తెచ్చి దీనికిచ్చి పంపాను.

'వోనిస్రీ' దేవత మధ్యాహ్నం దిగింది. తక్కుతూ తారుతూ! పోలీసుల గొడవ తాలూకు కంగా రేదీ దాని మొహంలో మచ్చుకైనా లేదు. దానిమీద నేను వెళ్ళగక్కిన కోపం అంతా ఇంతా కాదు. 'తిరు గుడు వేషాలేసి మప్మల్ని రికి స్తే ఒప్పుకోను' అన్నాను.

అది రెచ్చిపోయింది. "యావం దోయ్! మాట్లు వదల బాకండి. నేనట్టాంటి దాన్ని గాను. అయినా ఇట్టాంటియి పిన్నయో పెద్దయో ఏ ఆడదానికయినా వుంటయ్యి. మీ రయ్యన్నీ పట్టిచ్చుకోకూడదు. అస లందుకే టేసనుకు రమ్మనమని అయ్యగార్తో సెప్పమని సెప్పాను. ఆ దొమ్మరి ముందొచ్చి మీకు సెప్పింది గావాల్ను!"

'ఏ ఆడదానికైనా ఉంటయ్యి' అన్నమాట మీద నాకు చిర్రెత్తు కొచ్చింది. గొంతు పెంచి చడా మడా నాలుగు దులిపేశాను. దాంతో అది మరీ పేట్రేగిపోయింది.

చివరకంది-"మీకాడ నాక్కుదరదండి. నాకు డబ్బు పారెయ్యండి."

నెలవ్వటానికింకా ఐదు రోజు లుంది. ఐనా దాని డబ్బులు ఏడూ తెచ్చి దానికి పడేశాను. మళ్ళీ మనిషి దొరకడం కష్టంగదా, పోనీ బతిమాలి ఉంచుకుందామా అంటే, వలవేసి అది శ్రీవార్ని ఉంచు కుంటుందేమోనని భయం! (నా భయమే సుమండీ! పాపం శ్రీవారు మంచివారే!) ఆ డబ్బు తీసుకుని విలాసంగా తిప్పుకుంటూ 'వోనిస్రీ' వెళ్ళిపోయింది.

ఆ మధ్యాహ్నం కూర్చుని యథాలాపంగా నా వల్ల దానికి ముట్టిన డబ్బు లెక్కేశాను. జీతం కాక యాభై తేలింది!

నా మీద నాకే జాలేసింది!

* * *

చవక జీతం పనిమనిషంటే ఏమిటో నసాళం అంటేటట్టు అర్థ మయి పోయింది!